


ప్రియమైన నారాయణా!

మీకు ఆశీస్సులు !!

ఈ ఉత్తరం బహుశః నేను బూడిదై పోయాక నీ కళ్ల బడుతుందని అనుకొంటున్నాను! పక్షవాతంతో కుడిచెయ్యీ, కాలూ పడిపోయిన పద్నాలుగు సంవత్సరాల తర్వాత— ఇప్పుడు ఎడంచేత్తో పట్టేపట్టి వ్రాస్తూ ఉంటే చాలా చిరాగ్గా, బాధగా ఉంది! అయినా వ్రాస్తాను! ఈ నాలుగు మాటలూ కూడా నేను వ్రాయకపోతే నా గుండె బరువు తగ్గదురా !!

బాబూ! నిన్ను కలక్టర్ చెయ్యాలని మీ అమ్మ కలలు కనేది నీ చిన్నప్పుడు! నిర్భాగ్యుణ్ణి! నిన్ను కలక్టరాఫీస్‌లో గుమస్తాగా మాత్రమే చేయగలిగాను! అందులో నీ తప్పేమీ లేదురా! కలక్టరవడానికి తగిన తెలివితేటలు నీకున్నా, నీతి నిజాయితీగా గుమాస్తాగా ఉద్యోగం వెలగబెట్టిన నేను నీకు పెద్ద చదువులు చెప్పించలేకపోయాను!

నీకు పదేళ్ల వయస్సప్పుడు—నీకు జ్ఞాపకం ఉందా? మీ అమ్మకు పచ్చకామెర్లు వచ్చాయ్! పెద్ద డాక్టర్‌కు చూపెట్టడానికి డబ్బుల్లేవు నా దగ్గఅ. నా స్థితి నెరిగిన మీ అమ్మ ఏవో ఆకుపసర్లూ—అర్థంలేని పథ్యాలూ చేసింది. కామెర్లు తగ్గినట్లే తగ్గి, మళ్ళీ తిరగబెట్టి మీ అమ్మను ఈ లోకం నుంచి తీసుకుపోయాయ్! ''పెళ్లానికి సరైన వైద్యం చేయించక చేతులారా చంపుకున్నాడు—'' అని లోకం కాకుల్లా పొడుస్తున్నా మొండిగా బతికాను! ఎందుకో తెలుసా! నీ కోసం !!

ఆ రోజు...నువ్వు ఉద్యోగంలో చేరవలసిన రోజు !! నేను మనస్సులో ఎంత కుమిలిపోయానో! నిన్ను కలక్టర్ చదువు చదివించాలని తల్లడిల్లిన మీ అమ్మ పైనుండి ఎంత క్షోభపడ్డదో? మెడ దగ్గర చిరిగిపోయిన చొక్కాతో సర్టిఫికెట్లు పట్టుకుని గుమాస్తా ఉద్యోగంలో జాయిన్ అవడానికి నువ్వు వెళుతుంటే నాకు నిజంగా ఏడుపొచ్చిందిరా! నారాయణా!! ఎల్లాగో దిగమింగుకుని అన్నాను ''బాబూ! మొదటి జీతం అందుకోగానే రెండు జతల బట్టలు కుట్టించుకో'' అని. కానీ నీ చిరునవ్వే నాకు సమాధానం అయ్యింది అప్పుడు! నువ్వు అచ్చం మీ అమ్మ పోలిక కదా! కష్టాల్ని చిఱునవ్వుతో ఎదుర్కోడం దానికీ, నీకే చేతవును!

నెలాఖరుని కొత్తపంచ, చొక్కాగుడ్డ తెచ్చి ''నా మొదటి జీతంతో కొని తెచ్చాను! కాదనకు నాన్నా!'' అని నా చేతిలో పెట్టి, నా కాళ్లకు నమస్కారం పెట్టావ్! నీ పితృప్రేమకు నా మనస్సు గర్వంతో నిండిపోయిందిరా ఆనాడు!

నేను దూరదృష్టి లేనివాణ్ణి! చవటనోయ్! చవటను!

''నాన్నా! పెళ్లి జీవన్మరణ సమస్యకాదు! నైట్ కాలేజీలో బి. యె చదువుతాను! నాకు వచ్చే జీతం తక్కువ! నా జీతంమీద ఈ రోజుల్లో ముగ్గురు బ్రతకాలంటే కష్టం!'' అని నువ్వు నాకు చెబుతున్నా, ''ఏమో. కుర్ర సన్నాసి సిగ్గుపడి అల్లా అంటున్నాడేమో చక్కని గుణవంతురాలైన పిల్ల దొరికింది'' అనుకుని నిన్ను పోరి పోరి పెళ్లిపీట ఎక్కించాను! తర్వాత్తర్వాతగానీ నువ్వు చెప్పిన మాటలు నాకు నిజం అని తోచలేదు!

ఈ రోగిష్ఠి వాడికోసం...

అన్ని సరదాల్నీ చంపుకుని పదేళ్లుగా కాపురం చేస్తున్న మిమ్మల్నిద్దర్నీ ఏవని మెచ్చుకోవాలో నాకు మాటలు దొరకడంలేదు!

మంచంమీంచి కదల్లేని నాకు ఏం అవసరం వస్తుందోనని మీరు సినిమాలు మానుకున్నారు! షికార్లు మానుకున్నారు! చిలకాగోరింకల్లా — స్వేచ్ఛగా ఆడుతూ, పాడుతూ ఉండవలసిన ఈ వయస్సులో ఈ ముసలి రోగిష్ఠివాడికోసం సరదాలన్నీ చంపుకుని— రాత్రీపగలూ వంతులు వేసుకుని నా అవసరాల్ని కనిపెట్టుకుని ఉన్నారా? నా వెర్రిబాగన్నల్లారా!!

చిన్నప్పుడు నా నేస్తాలు తూనీగల్ని పట్టుకుని వాటి తోకలికి చిన్నరాళ్లు కట్టి వదిలేవారు! అవి పైకి ఎగురుతూ మళ్లీ కిందకు దిగిపోతూ పడిపోతూఉంటే వాళ్లంతా తప్పట్లు

# పండుటాకు - పసిచిగురు

కొట్టి ఆనందించేవారు నాకు నిన్నూ, కోడల్ని చూస్తుంటే ఆ రాళ్ళు కట్టిన తూనీగలే జ్ఞాపకం వస్తున్నాయిరా !!

కోడలు సుగుణ !! ఆ అమ్మాయిని కోడలు అని పిలవడమే తప్పేమో ! నాకు కూతురులేని లోటు తీర్చింది !

నన్ను ఈ పదేళ్ళుగా కంటికి రెప్పలా కాచింది !

కాలూ చేయీ బాగుండి చాకిరీ చేసే అత్త మామల్నే చీదరించుకునే కోడళ్ళు ఎక్కడబడితే అక్కడ సాక్షాత్కరిస్తున్న ఈ రోజుల్లో కోడలుపిల్ల తప్పబుట్టిందిరా ! సుగుణ నిజంగా సుగుణే !!

ఎడంచేత్తో నేను అన్నం తినడానికి ఉపక్రమిస్తుంటే, తాను అన్నం కలిపి నా నోటికి అందించింది !

ప్రతి అరగంటకు వచ్చి నా అవసరాల్ని అడిగింది !

ఊడిపోతున్న పంచను బిగించి కట్టుకోలేక చేతికి పట్టుదొరక్క సిగ్గుతో అవస్థలు పడుతుంటే నా కోడలు వచ్చి నాకు పంచ బిగించి వెళ్ళేది !

ఎలా ? చిరాకుతో కాదు! విసుగుతోకాదు

దేవుణ్ణి పూజించేటప్పుడు "వస్త్రం సమర్పయామి" అన్నప్పటి భక్తి ప్రపత్తులతో !!

"నా కొడుకూ, కోడలూ నన్ను సరిగ్గా చూడ్డంలేద"ని కనిపించిన వాడికల్లా చెప్పుకుని ఏడ్చే నా స్నేహితులకి నా భాగ్యాన్ని చెప్పి, వాళ్ళ అసూయతో ఏడ్చి ఛస్తుంటే నాకు చూడాలని ఉంది ! కాలూ చేయీ లేని నాకు ఈ కోరిక తీరలేదురా !

నా కోసం, ఈ కదలలేని, ముసిలివాడి కోసం, మీ ఆశలు సరదాలూ అన్నీ చంపుకొని — మీ ఇద్దర్లో నాకొరకు కాలైతే, ఒకరు చెయ్యి అయి నా బతుకును ఏలోటూ లేకుండా నడిపిస్తుంటే— నాలో నేను—నా మీద నేను— సంతోషపడనా ? జాలిపడనా ? గర్వపడనా? ఏడవనా ??

చాలా సార్లు అనిపించేది ! ఆత్మహత్య చేసుకోవాలని ! కానీ ! విషం కొనుక్కోడానికి కూడా నాలుగడుగులు వేయలేను కదా ! "నన్ను ఈ లోకం నుండి త్వరగా తీసుకుపో ! తండ్రీ!" అని భగవంతుణ్ణి ప్రార్థించడం తప్ప ఏమీ చెయ్యలేకపోయాను !

ఆ పరమాత్ముడికి నా మీద దయలేదు ! సుమారు పధ్నాలుగేళ్ళు నాకు కఠిన కారాగారశిక్ష విధించి వదేసాడు

జీవితం చాలించే శుభఘడియలు నాకు దగ్గర్లోనే ఉన్నాయనిపిస్తోందిరా ఈ మధ్యన !

కానీ, ఒక్క కోరిక మాత్రం నాకు తీరలేదురా !

నువ్వు ఆఫీసుకు వెళ్ళిపోతావ్ ! కోడలు వంట ఇంట్లో ఏవో పనుల్లో మునిగిపోతుంది ! అప్పుడు ఈ గదిలో నాకేమీతోచేది కాదు ! "ఒక్క చిన్ని మనవడు ఉంటే కాలం ఎంత బాగా గడిచేదో !" అనిపించేది ! మీరు వాణ్ణి మన మధ్యకు ఎందుకు తీసుకురాలేదో నాకు తెలుసు ! నీ చిన్ని జీతంలో నలుగురైతే బ్రతకలేమనే కదూ ?

ఈ ఆలోచన నాకు వచ్చినప్పుడల్లా నా వ్యర్థ జీవితం మీద నాకు ఎంత అసహ్యం కల్గుతోందో చెప్పలేను !

నా జీవితం ముగింపుకి వస్తోంది ! నా స్థానంలో ఏడాది తిరక్కుండా మీరు ఒక బుజ్జిగాణ్ణి ఈ ఇంట్లోకి తీసుకురావాలి ! ఇది అభ్యర్థనకాదు నీ ప్రియాతి ప్రియమైన తండ్రి శాసనం అనుకో !

ఎక్కడో చదివాను "పండుటాకులు రాలిపోతేనే పసి చిగుళ్ళకు స్థానం" అని !

ఈ సంసార వృక్షంలో పసిచిగురు మొలకెత్తడానికై పండుటాకునైన నేను ఎంత గమ్మున రాలిపోతే అంత అదృష్టవంతుణ్ణి !"

నాల్గురోజులబట్టీ ఈ ఉత్తరం కొంచెం కొంచెం వ్రాస్తున్నాను ! ఇంక ఎక్కువ వ్రాయలేను ! చెయ్యి బాధ పెడుతోంది !

ప్రతినెలా ఒకటో తారీఖుని జీతం అందుకుని నువ్వు నాకు పదిరూపాయలు ఇస్తూ వచ్చేవ్ "నాకెందుకురా! మంచం దిగలేనివాణ్ణి" అంటే "నీకు ఏదైనా తినాలనిపిస్తే పక్కింటి పిల్లల చేత తెప్పించుకో" అనేవాడివి !

ఈ పధ్నాలుగేళ్ళుగా నువ్విచ్చిన డబ్బు నా తలగడలో దాచి ఉంచాను ! సుమారు పదిహేను వందలకు దగ్గరగా ఉంది ! అది తీసుకోండి !

నేను చచ్చిపోతే నా కోసం మీరు ఒక్క కన్నీటి చుక్కకూడా విడవడానికి వీల్లేదు ! ఇన్నాళ్ళూ ఇన్నేళ్ళూ మీ అభిమానాన్ని, ప్రేమనీ, సహనాన్నీ, సేవనీ, నేను భరించలేకపోయాన్రా ! రేపు నేను చచ్చేకైనా మీరు నన్ను ఒక్కసారి ఒక్కసారైనా ద్వేషిస్తేనే నాకు ఆత్మతృప్తి !!

నేను దాచిన డబ్బులో అయిదు వందలు మీ ఇద్దరినీ దానితో హాయిగా, సరదాగా నాల్గాళ్ళూ తిరిగి రండి ! వెయ్యి రూపాయలు మాత్రం ఈ ఇంట్లో పుట్టబోయే నా మనవడికి తాతయ్య బహుమతి !!

ఏడాది తిరక్కుండా ఈ ఇంట్లో నా మనవడు తప్పటడుగులు వేస్తూ తిరగాలి ! నా చివరి కోరిక తీరుస్తారు కదూ ??

భగవంతుడు మళ్ళీ జన్మించమని నాకు శిక్ష విధిస్తే, ఆనందంగా మీ కడుపునే పుడతానని కోరుకొని మీ ఋణం తీర్చుకోవాలనుందిరా !!

ఒరే నారాయణా ! సుగుణా !

మీ ఇద్దరికీ నా ఆశీస్సులు ! కాదు నమస్కారాలు !!

ఇట్లు
శ్రీరామచంద్రమూర్తి

* * *

నారాయణా, సుగుణా పీటల మీద కూర్చున్నారు

సుగుణ ఒడిలోని బిడ్డ కేరింతలు కొడుతున్నాడు

"చెప్పండమ్మా ! అబ్బాయికి ఏం పేరు పెడుతున్నారు ? అయ్యా ! ఉంగరంతో ఆ అబ్బాయి పేరు మీరు బియ్యంలో వ్రాయాలి !!" అన్నాడు పురోహితుడు !!

నారాయణ ప్రశ్నార్థకముగా సుగుణకేసి చూసాడు !

ఆమె భక్తితో అంది "శ్రీరామచంద్రమూర్తి"

బియ్యంలో శ్రీకారం చుడుతున్న నారాయణ కళ్ళు ఆర్ద్రమైనాయ్ !! ★

చంద్రమోహన్ ఫాన్స్ అసోసియేషన్, విజయవాడ వారు ఇటీవల ప్రముఖ రేడియో, సినీ సంగీత దర్శకుడు శ్రీ మల్లిక్‌కు సన్మానం చేసిన సందర్భంగా తీసిన చిత్రం మల్లిక్ దంపతులని, శ్రీయుతులు పి సత్యనారాయణ, డి. వి ఎస్ ప్రకాష్, కె దామోదరరావులని ఫొటోలో చూడవచ్చు

